క్లుప్తంగా

వన్నలిలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సోహినీరాఘవ్

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీ రాఘవ్ ఆధ్వర్యంలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురికి బీపీ,సుగర్, తదితర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సర్పంచ్ గార రమణ, ఆశ వర్కర్లు రాములమ్మ, సావిత్రి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



నాగరాజును సత్కరిస్తున్న హుదా ముస్లిం అసోసియేషన్ ప్రతినిధులు

బొబ్బిలి: ప్రజారోగ్య పరిరక్షణ కోసం పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు.జిల్లా స్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా అవార్డు స్వీకరించిన బంగారి నాగరాజును అసోసియేషన్ భవనం వద్ద బుధవారం సత్కరించి, వెయ్యి రూపాయిల నగదు అందజేశారు.కార్యక్రమంలో హుదా అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, జామియా మసీద్ కమిటీ అధ్యక్షుడు భాషా,కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లేగదూడ మృతి



మృతి చెందిన లేగదూడ

వంగర: మద్దివలస గ్రామంలో పాడిరైతు పాతర్లపల్లి మహేష్‌కు చెందిన లేగదూడ విద్యుత్ షాక్‌తో బుధవారం మృతిచెందింది. గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు దూడ మేతకు వెళ్లిందని, అక్కడ కంచె సరిగా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిందని బాధిత పాడి రైతు తెలిపారు.విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచెను పటిష్టం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

వంగర: గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పిన్నింటి రామారావు సూచించారు. మద్దువలసలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు.విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎల్లవేళలా కాచి చల్లార్చిన తాగునీటిని, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపాల్ రాధికకు సూచించారు.

దివ్యాంగ పింఛనర్లకు నోటీసులు

బాడంగి: మండలంలో 105మంది దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులు పంపించామని ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం తెలిపారు. గతంలో నోటీసులు అందుకుని వైకల్యం పరీక్షలు చేయించుకోని దివ్యాంగులకు మళ్లీ నోటీసులు జారీ చేశామని చెప్పారు. వీరంతా ఏయే ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్న విషయాన్ని నోటీసులో పేర్కొన్నామన్నారు. వైద్య పరీక్షల కోసం చీపురుపల్లి,గజపతినగరం, ఎస్.కోట, రాజాం ఏరియా ఆస్పత్రులను కేటాయించినట్టు చెప్పారు. నోటీసులు అందుకున్న పింఛనుదారుల్లో లోకోమోటార్–41, కంటిచూపులేని వారు 30 మంది, వినికిడి లోపం ఉన్న వారు 30 మంది ,మానసికస్థిమితం లేని వారు ముగ్గురు, ఇతర అంగ వైకల్యం కలిగిన వారు ఒకరు ఉన్నారని చెప్పారు. వీరంతా ఈనెల10వతేదీన కేటాయించిన ఆస్పత్రులకు వెళ్లి తనిఖీలు చేయించుకుని, డాక్టర్ల సర్టిఫికెట్ పొందాలని వివరించారు.

దారులు ఛిద్రం.. ప్రయాణం నరకం..!

- గోతులమయమైన గ్రామీణ ప్రాంత రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టని వైనం



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారం- ఉత్తరావల్లి మధ్య శిథిలమైన రోడ్డు



తెర్లాం: కాగాం-పాములవలస రోడ్డులో ఏర్పడిన గోతుల్లో నిలిచిన నీరు



తెర్లాం: బురదమయమైన ఉద్దవోలు-యు.గదబవలస రోడ్డు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామాలను అనుసంధానం చేసే రోడ్లతో పాటు మండల కేంద్రాలను అనుసంధానం చేసే రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. పెద్దపెద్ద గోతులతో, రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.వర్షాలు కురుస్తుండడం తో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా మలుపుల వద్ద ఉన్న గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులకు తోడు రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడం ప్రమాదాలకు కారణ మవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– తెర్లాం/సంతకవిటి



తెర్లాం: తమ్మయ్యవలస రోడ్డులో ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు



తెర్లాం: చెరువులా దర్శనమిస్తున్న కుసుమూరు-అంపావల్లి రోడ్డు



తెర్లాం: అధ్వానంగా అంట్లవార గ్రామ రోడ్డు



సంతకవిటి: సంతకవిటి- రాజాం ప్రధాన రహదారిలో తాలాడ వద్ద మలుపులో ఏర్పడిన గొయ్యి



సంతకవిటి: సంతకవిటి-చిత్తారపురం రహదారిలో గుంతలు



సంతకవిటి: సంతకవిటి- పొందూరు రోడ్డులో అప్పలాగ్రహారం సమీపంలో ఏర్పడిన గుంత



సంతకవిటి: సంతకవిటి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో మలుపు వద్ద ఏర్పడిన గుంత

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం



ఎస్.వసంతరావు, ఆప్తాలమిక్ అధికారి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నేపథ్యంలో కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుధవారం ఆయన సాక్షికి వివరించారు. నేత్రసంరక్షణకోసం జాతీయ, అంతర్జాతీయ నేత్ర సంరక్షణ సంస్థలు ఏటా అక్టోబర్ రెండో గురువారాన్ని ప్రపంచ దృష్టి దినోత్సవంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఆనందాన్ని అనుభవించడంలో దృష్టి పాత్ర ప్రధానమని, మీ కళ్ల ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. చిన్నారుల కంటి ఆరోగ్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అన్నారు. చిన్నారులను టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఆరుబయట కనీసం రోజులో ఒక గంటసమయం గడపాలని అన్నారు. చదివేటప్పుడు, రాసేటప్పుడు సరైన వెలుతురు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తరచుగా ఆకు కూరలు, కూరగాయలు ఆహారంతో తీసుకోవాలని అన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకోకపోవడం, టీకాలు సకాలంలో వేసుకోకపోవడంతో తక్కువ బరువు, నెలలు నిండకుండానే పుట్టిన చిన్నారుల కంటిలో రెటినోపతి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ అరగంటకు ఒకసారి మొబైల్, కంప్యూటర్, లాప్‌టాప్ నుంచి రెండు మూడు నిమిషాలైనా దృష్టిని మరల్చాలి. కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి. యాంటీగ్లేర్, యాంటి రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి. కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలుంటే కాసేపు మానిటర్లు చూడడం ఆపేయాలి. తరచూ చల్లని నీటితో కళ్లను కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రాన్ని కప్పి ఉంచాలి. కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందుకోసం కళ్లను కుడి,ఎడమలకు నిమిషంపాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దుకుని వేడెక్కిన తర్వాత కళ్లపై కాసేపు ఉంచి కసరత్తు చేయాలి.

19న 'రామాయణం'పై చిత్రలేఖన పోటీలు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వికాసతరంగిణి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన రామాయణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని సారథి విజయకోదండరామ ఆశ్రమ అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను వికాసతరంగిణి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామా యణంలోని ముఖ్యసన్నివేశాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 8, 9 తరగతులు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వికాసతరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, పోటీల కన్వీనర్ కొత్తా రమేష్‌కుమార్, సభ్యులు పాదిలాపు కృష్ణ, గెడ్డాపు శ్రీలక్ష్మి, ఆశపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

సత్తా చాటిన కొట్టక్కి హైస్కూల్ విద్యార్థినులు



గోల్డ్ మెడల్స్,కప్‌తో విద్యార్థినులు

రామభద్రపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన బాలికల 12వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ప్రథమ స్థానం లో నిలిచింది. జిల్లా జట్టుకు మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సిమిరెడ్డి వర్షిని,8వ తరగతి విద్యార్థినులు కుమిలి మౌనిక, బత్తుల త్రిలోచన ప్రాతి నిధ్యం వహించారు. జిల్లా జట్టు తరపున వీరు ఉత్తమ ప్రదర్శన కనబరిచి జట్టు విజయంలో కీలక భూమిక పోషించారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం ఏ.శ్రీనివాసరావు,పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏ.వీరంనాయుడు,ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జీఎస్టీపై వక్తృత్వ పోటీలు

బాడంగి: జీఎస్టీ తగ్గింపుల వల్ల కలిగే ప్రయోజనాలపై స్థానిక ఎమ్మార్సీలో విద్యా ర్థులకు మండలస్థాయి వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు బుధవారం నిర్వహించారు. బాడంగి, కోడూరు, పాల్తేరు, గజరాయునివలస ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను పర్యవేక్షించిన ఎంఈఓ లక్ష్మణదొర మాట్లాడుతూ మండలస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. గురువారం నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్నిప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల13 నుంచి 16వ తేదీ వరకు ఎఫ్‌ఏ–2 పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొ న్నారు.



రేగిడి: పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థినులతో ఎంఈఓ ప్రసాదరావు

చిన్నశిర్లాంలో..

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.హెచ్‌ఎం జి.రోజారమణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు పరిశీలించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

బొబ్బిలి: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అంతరిక్ష పరిశోధనల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక రాజా కళాశాలలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారో త్సవం–2025 కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్ర,సాంకేతిక రంగాల్లో వస్తున్న పరిణామాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన కల్పించడం,వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. షార్,ఎస్డీఎస్సీ,ఎస్‌ఎంపీసీ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు మాట్లాడుతూ అంతరిక్షశాస్త్రం, సాంకేతిక అద్భుతాలను విద్యార్థులకు వివరించారు. వరల్డ్‌స్పేస్‌వీక్–25 బ్రోచర్‌ను విడుదల చేశారు.అనంతరం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ చేశారు. కళాశాల సెక్రటరీ బదరీ, వివిధ కళాశాలల విద్యార్థులు, షార్ సిబ్బంది పాల్గొన్నారు.



వరల్డ్ స్పేస్‌వీక్-2025 బ్రోచర్‌ను విడుదల చేస్తోన్న ఎమ్మెల్యే, అధికారులు, అధ్యాపకులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం



వంగర: కొండచాకరాపల్లిలో నందెన్నకు పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: బొబ్బిలిలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పురోహితుడు

బొబ్బిలి: నందెన్న ఉత్సవాలు పట్టణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. చిక్కాలరెల్లివీధిలో సమరసత ఫౌండేషన్, ధర్మ ప్రచా రక్ సభ్యుడు దూపం వాసు ఆధ్వర్యంలో శివపార్వతులు కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ కార్య క్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

వెంకటాపురంలో..

రేగిడి: మండలంలోని వెంకటాపురం గౌరమ్మ, నందెన్నలకు గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాం స్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



తెర్లాం: పణుకువలసలో పూజలందుకుంటున్న పార్వతీ,పరమేశ్వరులు

తెర్లాంలో..

తెర్లాం: మండల కేంద్రం తెర్లాంతో పాటు పలు గ్రామాల్లో నందెన్న సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి గ్రామాల్లో పార్వతీ,పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. నాగుల చవితి వరకు రోజూ పూజలు నిర్వహించి, అదే రోజు అను పోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల్లో నందెన్న గద్దెల వద్ద ఆయా గ్రామాల ప్రజలు బుధవారం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పలువురు మహిళలు గౌరమ్మ పాటలను ఆలపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

తూటి కాడ కషాయంతో సుడిదోమ నివారణ



బొబ్బిలిరూరల్: తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది

బొబ్బిలిరూరల్: వరి పంటను ఆశించే సుడిదోమను తూటికాడ కషాయంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలి పారు. మండలంలోని జగన్నాథపురం లో రైతులకు తూటికాడ కషాయం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. 30 లీటర్ల గోమూత్రం, 30 కిలోల తూటికాడ ఆకులు, ఇంగువ కలిపి మరగ బెట్టాల ని, అనంతరం ఆద్రావణాన్ని వడకట్టి పంటలకు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

చాటాయివలసలో...

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో రైతులకు తూటికాడ కషాయం తయారీపై ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ రమాదేవి బుధవారం అవగాహన కల్పిం చారు. ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు రమణ, తవిటి నాయుడు పాల్గొన్నారు.

'ఆడ బిడ్డను కాపాడుకుందాం'



రామభద్రపురం: మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రాజాం: దోలపేట హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థినులు

రామభద్రపురం: ఈనెల 11వ తేదీన అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆడ బిడ్డను కాపాడుకుందాం' అనే అంశంపై స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 పెంటయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం వి.గోపానాయుడు, సోషల్ టీచర్ కె.దాలినాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో రామభద్రపురం,ఆరికతోట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ఎంఈఓ తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఈనెల 9వ తేదీన విజయనగరం సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

దోలపేట ఉన్నత పాఠశాలలో...

రాజాం: అంతర్జాతీయ బాలికల దినోత్సవం నేపథ్యంలో దోలపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఎంఈఓ యాగాటి దుర్గారావు పర్యవేక్షణలో 'ఆడ బిడ్డను కాపాడుకుందాం' అనే అంశంపై బుధవారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని కొరికాన అనూష ప్రథమ స్థానం, మనీష ద్వితీయ స్థానం, ఎం.బాలామణి తృతీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో బి.హాసిని ప్రథమ స్థానం, బి.మనీష ద్వితీయ స్థానం, ఎల్.నిహారిక తృతీయ స్థానంలో, చిత్రలేఖన పోటీల్లో బొండాడ లలిత ప్రథమ స్థానం , ఆర్.కీర్తన ద్వితీయ స్థానం, నాగళ్ల లాస్యప్రియ తృతీయ స్థానంలో నిలిచారని ఎంఈఓ వెల్లడించారు. వీరికి ఈనెల 11న బహుమతులు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

బొబ్బిలిరూరల్: రాష్ట్ర ఆహార సలహా సంఘం కమిటీ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి మండలంలో గురువారం పర్యటించనున్నారని సీఎస్‌డీటీ సాయికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాలు,రేషన్ డిపోలను, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను పరిశీలించనున్నారని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న రమాచంద్రిక

రేగిడి: స్థానిక మండల వనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో మండలానికి చెందిన పలువురు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్టు రమాచంద్రిక బుధవారం ఫిజియోథెరపీ చేశారు. అంగవైకల్యం ఉన్న పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం వల్ల వారిలో వైకల్యం కొంతమేర తగ్గే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఇక్కడ చేస్తున్న ఫిజియోథెరపీని తల్లిదండ్రులు గమనించి ఇళ్ల వద్ద అలా రోజూ చేయాలని సూచించారు. ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు, ఐఈఆర్‌టీలు యు.మహేశ్వరి, టి.రాజేష్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.